క్లుప్తంగా

మునుగోడు ఎంపీడీఓగా యుగేందర్‌రెడ్డి

మునుగోడు : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి. యుగేందర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరబాద్ జీహెచ్ ఎంసీలో పనిచేస్తున్న ఆయన బదిలీపై మునుగోడుకు రాగ ఇక్కడ పనిచేస్తున్న విజయ భాస్కర్‌ని గుర్రంపోడు ఎంపీడీఓగా బదిలీ చేశారు. యుగేందర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న అనంతరం పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

ఘనంగా ద్వాదశ పుష్కర బ్రహ్మోత్సవాలు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని చంద్రగిరి విలాస్ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ద్వాదశ పుష్కర బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు, చక్రి ఉదయం సుప్రభాత సేవ, నిత్యారాధన సేవా కాలం, శాంతి పటం, వేద విన్నపం, నిత్య హోమం ,మహా పూర్ణాహుతి, చక్రస్నానం జరిపించారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, దేవతోద్వాసన, శ్రీ పుష్పయాగం, మహా కుంభ ప్రోక్షణ అనంతరం కదంబ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వేముల సాయికుమార్, సభ్యులు రావుల శ్రీనివాస్, జిల్లపల్లి వెంకటేశ్వర్లు, జిల్లపల్లి శ్రీనివాస్, విజయ్ కుమార్, మేడి లింగస్వామి, శ్రీదేవి, ప్రమీల, శిరీష ,కల్పన, ధనలక్ష్మి ,మంజుల, యాదమ్మ, పవిత్ర, రమ ,అంజలి, శ్రీ హర్షిని ,తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం

కనగల్: ఇటీవల మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన ఎర్రబెల్లి ప్రవీణ్ రెడ్డి మృతి చెందాడు. రామచంద్రపురం గ్రామంలో మంగళవారం ప్రవీణ్ రెడ్డి సంస్మరణ సభను విద్యార్థులు నిర్వహించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నల్లగొండ ప్రభుత్వ వికలాంగుల హాస్టల్ తరఫున విద్యార్థులంతా కలిసి రూ.60 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేమిరెడ్డి దిలీప్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్ భజరంగ్ ప్రసాద్‌కు కలెక్టర్ సన్మానం



భజరంగ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: జాతీయ గోల్డ్‌మెడల్ అవార్డు పొందిన సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్టు కంది భజరంగ్ ప్రసాద్‌ను మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తన ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భజరంగ్‌కు ఇప్పటికీ 79 అవార్డులు రావడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు క్రిస్టఫర్, డాక్టర్ ఏ ఏ ఖాన్, సొరయ్య, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మర్రిగూడ : కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 13న మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 220మందికి ఆపరేషన్లకు ఎంపిక చేసి 171మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు పూర్తయిన వారి కన్ను పనితీరు ఎలా ఉందనే దానిపై మంగళవారం వైద్యులు మరోసారి వారికి కంటి పరీక్షలు నిర్వహించి వారికి తగిన సలహాలు, సూచనలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి సుమారు 245 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాల అల్వాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య పాల్గొన్నారు.

సీపీఎస్ అంతమే పీఆర్‌టీయూ లక్ష్యం

మర్రిగూడ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ అంతమే లక్ష్యంగా పీఆర్‌టీయూ పనిచేస్తుందని సంఘం మండల అధ్యక్షుడు పాల్వాయి వెంకట్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ అంతమే లక్ష్యంగా చేపడుతున్న ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి మాస బాలరాజు, జిల్లా బాధ్యులు భిక్షమయ్య, విఠల్, పాల్గొన్నారు.

వర్షపు నీరు వెళ్లే దారేది!



కట్టంగూర్‌లో సర్వీసు రోడ్డు పక్కనే నిలిచిన వర్షపు నీరు



మసీదు ఎదుట నిలిచిన నీరు

- సర్వీసు రోడ్డు పక్కన అసంపూర్తిగా డ్రెయినేజీలు
- గుంతల్లో నిలుస్తున్న నీరు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కట్టంగూర్ : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కట్టంగూర్ మండల కేంద్రంలో అండర్ పాస్ బ్రిడ్జికి ఇరువైపులా 2014 సంవత్సరంలో జీఎంఆర్ అధికారులు సర్వీసు రోడ్డు నిర్మించారు. సర్వీసు రోడ్డు వెంట డ్రెయినేజీలు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు పదకొండు సంవత్సరాలుగా వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపై వర్షపు నీరు, డ్రెయినేజీ నీరు నిలిచి ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతమంతా చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ద్విచక్ర వాహనదారులు, ప్రజలు సర్వీసు రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించేందుకు నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

దోమలకు ఆవాసంగా మారి..

కట్టంగూర్‌లో అండర్‌పాస్ బ్రిడ్జికి ఇరువైపులా డ్రెయినేజీలు అసంపూర్తిగా నిర్మించడంతో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డు సమీప ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో దాగిగుండా వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో కొద్దిపాటి వర్షం కురిసినా వారం రోజులకుపైగా సర్వీసు రోడ్డు పక్కనే నీరు నిల్వ ఉండడంతో రోడ్డు గుండా వెళ్లే ప్రజలు, చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. వర్షపు నీరు సర్వీసు రోడ్డు పక్కనే నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారి దుర్వాసన వస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. సర్వీసు రోడ్డుపై ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లేటప్పుడు రోడ్డు పక్కనే వెళ్లే ప్రజలపై బురద నీరు పడుతోంది. హైవే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలు పూర్తి చేయడంతోపాటు సర్వీసు రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ పనులు పూర్తిచేయాలి



అసంపూర్తిగా నిర్మించిన మురుగు కాలువతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మురికినీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డు పక్కనే వర్షపు నీరు నిల్వ ఉన్నా జీపీ సిబ్బంది, హైవే అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ పనులను పూర్తి చేసి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

– పలస సైదులు, కట్టంగూర్

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, సబ్ కలెక్టర్

నల్లగొండ: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినాయక మండపాల నిర్వాహకులు ముందే విగ్రహాల కొలతలతో సహ పోలీస్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతి శాఖ రోడ్ మ్యాప్ తయారు చేసుకోవాలని, పర్యావరణహిత మట్టి విగ్రహాలు వాడే విధంగా చూడాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణ విషయమై ఆర్డీఓలు డీఎస్పీలతో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ప్రతి విగ్రహాన్ని పోలీసుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మండపాల వద్ద రాత్రి సమయంలో ఒకరు తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలీస్‌ల తరఫున గట్టి బందోబస్తు, పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు హఫీజ్ ఖాన్, శాంతి కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్, ఏ ఏ ఖాన్, నేతిరఘుపతి, సలీం, నాగం వర్షిత్‌రెడ్డి, షొరయ్య, లక్ష్మయ్య, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



నాంపల్లి : పాఠాలు చెబుతున్న కలెక్టర్

నాంపల్లి : వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30పడకల ఆస్పత్రి నిర్మాణం పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. అనంతరం కలెక్టర్ పెద్దాపురం గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు బోర్డుపై రాసి పాఠాలు చెప్పారు. ఇంగ్లీష్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలో డైనింగ్ హాల్, వసతి గృహ సమస్యలపై కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూర్ ఆర్డీఓ శ్రీదేవి, మండల వైద్యాధికారి భవాని సాగర్, మండల విద్యాధికారి మల్లికార్జునరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తిని ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్, పక్కన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

శాలిగౌరారం : తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని వల్లాల గ్రామంలో నాటి నిజాం నిరంకుశత్వానికి బలైన అమరవీరుల జ్ఞాపకార్థం మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హన్మంతరావు సొంత ఖర్చులతో నిర్మించిన స్మారక స్థూపం ఆవిష్కరణ తేదీని నిర్ణయించేందుకు స్థల పరిశీలన కోసం మంగళవారం డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి వల్లాలకు వచ్చారు. కానీ వాతావరణ పరిస్థితులతోపాటూ మరో మూడు, నాలుగు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో ఆవిష్కరణ తేదీని ప్రకటించకుండా వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రజాపాలనలో ప్రజల కోసం నిస్వార్థంగా సేవచే సి ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలనే తపనతో పనిచేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం అమలును కేంద్రం ఆమోదించకపోయినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బీసీలకు 42 శాతాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎర్ర చైతన్య, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, నాయకులు చామల జయపాల్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్, భూపతి వెంకటేశ్వర్లు, అంజయ్య, తీర్వారి మల్లయ్య, పెరుమాండ్ల నరేశ్, బుడిగె వెంకటేశ్వర్లు, మంగదుడ్ల శ్రీను, మాదగోని రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను పరిరక్షించాలని వినతి

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయ భూముల గుండా ప్రైవేట్ వెంచర్లు వేస్తున్న రహదారిని నిలుపుదల చేయాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన నాయకులు మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేశ్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, నాయకులు ఏర్పుల రాకేష్, ఏర్పుల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం ఆ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్‌లోని గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఉప్పల అజయ్‌కు రూ.5వేల నగదు ప్రోత్సాహకం, మెమెంటో, ద్వితీయ స్థానంలో నిలిచిన వలిగొండ గాయత్రిలకు రూ.3వేల నగదు ప్రోత్సాహకం, మొమెంటోను ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సబిహా, ట్రస్ట్ చైర్మన్ తిరుపతి, సభ్యులు వెంకటేష్, సాయన్న, పరమేష్‌గౌడ్, నాజర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుడు గుమ్మి క్రిష్ణారెడ్డి, పాలెం సత్తయ్య, తాటి సరోజన రవీందర్, వలిగొండ పద్మ, వలిగొండ సునిత, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, వహీద్, నర్సయ్య, లీలావతి, చందన పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



నల్లగొండ : కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు

నల్లగొండ: ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఫొటోగ్రాఫర్ అప్డేట్ కావాలని తెలంగాణ రాష్ట్ర ఫొటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె హుస్సేన్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నల్లగొండ పట్టణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఫొటోగ్రఫీలో జాతీయ గోల్డు మెడల్ సాధించిన సాక్షి ఫోటో జర్నలిస్ట్ కంది బజరంగ్ ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఖమ్మంపాటి రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసపత్రి జనార్ధన్, కోశాధికారి పెరిక నాగరాజు, గౌరవ సలహాదారులు రాము, సప్తగిరి, కలీముల్లా, శ్రీరామదాసు గోపి, పల్లా వెంకటరెడ్డి, కోటా శ్రీనివాస్, కలగోని ధనుంజయ గౌడ్, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, గంధం రూపేంద్ర కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

నల్లగొండ: 186 వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఫొటోగ్రాఫర్ల జిల్లా అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ, కొత్తపల్లి శ్రీమన్నారాయణ, మోహన్ రెడ్డి, లక్ష్మణ్, జానయ్య, రామకృష్ణ, పాల్గొన్నారు.

నకిరేకల్ : ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నకిరేకల్ మండల కేంద్రంలో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ఫొటోగ్రాఫర్లు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని చిట్యాలలో మంగళవారం మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరాను కనుగొన్న లూయిస్ డాగురె చిత్రపటానికి ఆ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ల భయ్యన్న, రాష్ట్ర మహిళ సహాయ కార్యదర్శి ఏళ్ల మాధవిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనంతరం కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముప్పా సుఖేందర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి అవుల ఆనంద్, పాల్గొన్నారు.

కట్టంగూర్ : 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని కట్టంగూర్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీనివాసులు ఫొటోగ్రాఫర్లతో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బొబ్బిలి రాజా, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి కుమార్, వెంకటాచారి, వెంకన్న, కొండయ్య, కోటేష్, తుకారాం, శ్రీను ఉన్నారు.

నానో డీఏపీతో అధిక దిగుబడి



గట్టుప్పల్ : ఫర్టిలైజర్ షాపును తనఖీ చేస్తున్న తహసీల్దార్, ఏఓ

గట్టుప్పల్ : నానో డీఏపీ, యూరియాను వాడి అధిక దిగుబడులు సాధించాలని తహసీల్దారు రాములు, ఏఓ రేవతి అన్నారు. వారు స్థానిక ఫర్టిలైజర్ షాపులను తనఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానో వాడకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు రైతులకు శ్రమ కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

చండూరు : ఎరువుల వాడకంపై చండూరు వ్యవసాయాధికారి చంద్రిక రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం బంగారి గడ్డలో రైతులతో పత్తిచేనులో ఏఓ ఎటువంటి ఎరువులు వాడితే పంటల దిగుబడి వస్తుంది. భూమి పర్యావరణం నష్టం కలగకుండా ఉంటుందనే అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అనూష, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు అందించే నానో యూరియాను పంటల వాడకం వల్ల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని కేతేపల్లి ఏఓబి పురుషోత్తం అన్నారు. నానో యూరియా వాడకం, ప్రయోజనాలపై మంగళవారం కేతేపల్లిలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సదరం క్యాంపు



ఇటుకులపహాడ్‌లో దివ్యాంగులతో ఎంపీడీఓ, సదరం క్యాంపు వైద్యులు

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్‌లో మూగవారైన వృద్ధాప్య అక్కాతమ్ముడు జిల్లోజు పూలమ్మ, జిల్లోజు రాములుకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం సదరం క్యాంపు వైద్యులు మంగళవారం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాంపులో ఆడియాలజిస్టు అనిల్, వైద్య విస్తరణాధికారి రఫీలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సూచనలతో ప్రత్యేక స్లాట్ బుక్‌చేసి సదరం సర్టిఫికేట్ జారీ కోసం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. జిల్లోజు పూలమ్మ, జిల్లోజు రాములు గ్రామం విడిచి బయటకు వెళ్లేందుకు భయపడుతుండటంతో సదరం క్యాంపులకు హాజరు కాలేకపోతున్నారని, పుట్టుకతో మూగవారైన అక్కాతమ్ముడికి నేటికి సదరం సర్టిఫికేట్ లేకపోవడంతో ఆసరా పింఛన్ కూడా రాకపోవడం వల్ల పూట గడువలేని పరిస్థితిలో వారు పడుతున్న దీనావస్థకు చలించిన గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సుల్తాన్ యల్లయ్య సదరంసర్టిఫికేట్ ఇప్పించి పించన్ మంజూరు చేయించాలని కోరుతూ ఇటీవల ఎంపీడీఓ జ్యోతిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈనేపథ్యంలో సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రత్యేక సదరం క్యాంపు జరిగినట్లు ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి తెలిపారు.

ఆశల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



మర్రిగూడ పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

మర్రిగూడ: రాష్ట్రంలో ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మంగళవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మర్రిగూడ పీహెచ్‌సీ వద్ద ధర్నా చేసి మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సల్వోజు రామలింగాచారి, సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఏర్పుల పద్మ, పందుల పద్మ, భీమనపల్లి అరుణ, మెండు విజయమ్మ, శోభా, యాదమ్మ, సునీత, దుర్గమ్మ, సబిత, రాఘవేంద్ర, అనిత పాల్గొన్నారు.

నాంపల్లి: ఆశలకు కనీస వేతనం రూ.18000 ఇవ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్ల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశ వర్కర్లకు ఇంత వరకూ వేతనాలు రాలేదని తెలిపారు. ఆశ వర్కర్ల పారితోషికాలు ప్రతి నెలా 30లో పు ఇవ్వాలని తెలిపారు. ఆశ వర్కర్లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల వైద్య అధికారి భవాని సాగర్ కు ఆశా వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు సునీత, కవిత, మమత, సైదమ్మ, రజిత, అనిత, అంజమ్మ, శంకరమ్మ, భాగ్యమ్మ, జ్యోతి, కౌసల్య, అండాలు, శోభ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి ప్రణాళికలు



విద్యాశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

నకిరేకల్ : నకిరేకల్ నియోజవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో నకిరేకల్, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాలకు సంబంధించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. హాజరైన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో ఎక్కడెక్కడ పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలన్నారు. పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు పాఠశాల పటిష్టత కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గుత్తా మంజుల, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వేంకటేశ్వరరావు, స్థానిక ఎంఈఓ మేక నాగయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం కోదాటి రాములు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకరణాలతో బోధన సులభతరం



తిప్పర్తి : ఉన్నత పాఠశాలలో టీఎల్ఎమ్ మేళాను పరిశీలిస్తున్న ఎంఈఓ నర్సింహానాయక్

కేతేపల్లి : ఉపాధ్యాయులు తరగతి గదిలో ఉపకరణాలతో బోధించడంపై విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమవుతాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి టీఎల్ఎం (ఎఫ్ఎల్ఎన్) మేళాను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక ఎంఈఓ ఎ. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించన కార్యక్రమంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజుల మాధవరెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, నకిరేకల్ ఎంఈఓ మేక నాగయ్య, కేతేపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం వై.నర్సిరెడ్డి, పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు వి.రాధాక్రిష్ణామాచార్యులు, పి. పద్మ, వెంకటేశ్వర్లు, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనోపకరణ సామగ్రి ప్రదర్శన

తిప్పర్తి : మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో మంగళవారం బోధనోపకరణ వస్తు సామగ్రి మండల స్థాయి ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండల విద్యాధికారి నర్సింహ నాయక్ పాల్గొని తిలకించారు. విద్యార్థులు తమ నైపుణ్యం మేరకు తయారు చేసిన వస్తువులను పరిశీలించి అభినందించారు. నోకాస్ట్ లోకాస్ట్ ద్వారా చేసిన బోధన వస్తువులు తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన వస్తువుల ద్వారా త్వరగా అర్థమవుతుందని, వారు ఆధారంగా సులువుగా పాఠ్యాంశాన్ని నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈమేళా మండలస్థాయిలో యూపీఎస్, ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నిర్వహించనున్నారు. ఈమేళాలో పది ఉత్తమ ప్రదర్శనలకు మెమెంటోలు ఇవ్వడంతో పాటు, జిల్లా మేళాకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుశీల, యాదగిరి, జయరాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బోధనాభ్యాస సామగ్రి(టీఎల్ఎం) మేళా విజయవంతంగా ముగిసిందని మండల ప్రత్యేకాధికారి బి.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాలో మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనను మరింత ఆసక్తి కలిగించే విధంగా నో కాస్ట్, లో కాస్ట్‌తో టీఎల్ఎం తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పది మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. వీరిని త్వరలో నిర్వహించే జిల్లా స్థాయి టీఎల్ఎంకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పాల్వాయి వెంకట్‌రెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, టీపీయూఎస్ అధ్యక్షుడు రమణ, పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుంచి డాక్టరేట్ పట్టా అందుకుంటున్న జయంతి

నల్లగొండ : ఉస్మానియా యూనివర్సిటీ 84వ కాన్వొకేషన్ సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం నల్లగొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.జయంతి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డాక్టరేట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ డాక్టరేట్ నాకు మరింత బాధ్యత పెంచిందని తనకు డాక్టరేట్ రావడానికి సహకరించిన తన ప్రొఫెసర్‌కు ఆమె ధన్యావాదాలు తెలిపారు.

నాంపల్లి వాసులకు పీహెచ్‌డీ, గోల్డుమెడల్స్



గోల్డుమెడల్ అందుకుంటున్న సాయి ప్రసన్న



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న వెంకటేశ్వర్లు

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రానికి చెందిన బాణాల వెంకటేశ్వర్లు ఉస్మానియా యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మంగళవారం ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ వి.నారాయణ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందజేశారు. అనంతరం అదే మండల కేంద్రానికి చెందిన కామిశెట్టి సాయిప్రసన్నకు ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్‌సీ కెమిస్ట్రీ విభాగంలో గోల్డ్ మెడల్‌ను అందజేశారు.